క్లుప్తంగా

తపాలా ఉద్యోగుల రాష్ట్ర కన్వీనర్‌గా కామేశ్వరి



అనపర్తి : గ్రామీణ తపాలా ఉద్యోగుల మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా దుప్పలపూడి గ్రామ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కె.కామేశ్వరి ఎన్నికయ్యారు. నంద్యాలలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన గ్రామీణ తపాలా ఉద్యోగుల సదస్సులో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు అనపర్తి సబ్ పోస్టుమాస్టర్ కంభం సుమంత్ తెలిపారు. కామేశ్వరి దశాబ్ద కాలంగా పోస్టల్ యూనియన్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చురుగ్గా పనిచేశారన్నారు. జీడీఎస్ ఉద్యోగుల సమస్యలు, మహిళా ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేశారన్నారు. ఈ సందర్భంగా కామేశ్వరికి సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పశువులకు వైద్య సేవలు



పాడి రైతులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ హేమ తులసి తదితరులు

అనపర్తి: ఆరోగ్యవంతమైన దూడల కోసం పశువుల్లో గర్భకోశ వ్యాధులు, సమస్యల నివారణకు ముందస్తుగా పశు వైద్యుల సలహాలు సూచనలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వై.వెంకటేష్ అన్నారు. గురువారం కుతుకులూరు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. మండపేట రాష్ట్ర పశువైద్య శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన గర్భకోశ వ్యాధి నిపుణులు శిబిరంలో జీవాలను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 40 గేదెలు, 15 ఆవులకు వైద్య సేవలు అందించినట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ టి.రామచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమతులసి, ఇన్‌చార్జి డీఏహెచ్‌వో డాక్టర్ మక్కెన వెంకటేశ్వరరావు, మండపేట ఎస్ఏహెచ్‌టీసీ డీడీ డాక్టర్ పి.మనోజ్ కుమార్, ఏడీలు టీఎస్‌వీ అనిల్‌కుమార్, పి.నాగమణి, వెటర్నరీ అసిస్టెంట్ షేక్ షహెన్‌షా, ఏహెచ్‌ఏలు శ్రీనివాస్, శిరీష, స్థానిక రైతులు పాల్గొన్నారు.

రక్తదానం శిబిరం



రక్తదాతకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

బిక్కవోలు: రక్త దానం చేయడం వల్ల మరో ప్రాణాన్ని కాపాడుకోవచ్చని సర్పంచ్ సత్యంశెట్టి వెంకట రమణ అన్నారు. మానవసేవే మాధవసేవ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కాపవరంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది రక్తదానం చేశారు. అనంతరం వారికి మొక్క, ధ్రువీకరణ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మారెళ్ల భీష్ముడు, ఎస్సైవాసంశెట్టి రవిచంద్ర కుమార్, హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ చైర్మన్ సత్యంశెట్టి ఉమా మహేష్ పాల్గొన్నారు.

ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఆనంద్



రంగంపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలపై రంగంపేట మండలం ముకుందవరం గ్రామానికి చెందిన పందిరి ఆనంద్‌ను వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆనంద్‌కు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, నాయకులు అభినందనలు తెలిపారు. కాగా.. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు తన నియామకానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలకు ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు.

రావిపాటి సేవలు స్ఫూర్తిదాయకం



కోరుకొండలో పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

కోరుకొండ: దివంగత రావిపాటి శ్రీనివాసరావు సేవలు స్ఫూర్తిదాయకమని ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఏనుగుల చైతన్య మురళీ అన్నారు. రావిపాటి జయంతిని పురస్కరించుకుని గురువారం కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. 15 మంది విద్యార్థులకు రూ.2,600 నగదు బహుమతి, మెమెంటో, సర్టిఫికెట్లు అందించారు. బెస్ట్ స్పోర్ట్‌మెన్లుగా ఐదుగురికి రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేశారు. హెచ్ఎం మణికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో టి.కుశలవదొర, రావిపాటి శ్రీనివాసరావు సంస్థ ప్రతినిధులు రావిపాటి సత్యవతి, కోలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దారుణ మోసం..

- నిరుద్యోగులకు కూటమి ఝలక్
- స్వయం ఉపాధి రుణాలకు బ్రేక్
- గొప్పగా ప్రచారం చేసుకున్న పాలకులు
- ఇంటర్వ్యూలు నిర్వహించాక చేతులెత్తేసిన వైనం



బిక్కవోలులో కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు (ఫైల్)

బిక్కవోలు: స్వయం ఉపాధి రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. స్వయం ఉపాధి పొందాలనుకున్న వారి ఆశలపై నీరు చల్లింది. వివరాల్లోకి వెళితే.. వ్యాపారం, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు నిరుద్యోగులకు స్వయం ఉపాధి రుణాలు ఇస్తామని అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం ప్రచారం చేసింది. సుమారు 50 శాతం రాయితీలో మంజూరు చేస్తామని గొప్పలు చేసుకుంది. ఆ విషయాన్ని నమ్మిన అనేక మంది నిరుద్యోగ యువత ఆశతో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం వారికి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆ తర్వాత అంతా సైలెంట్ అయిపోయారు. రుణాలు ఎప్పుడిస్తారనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు.

దరఖాస్తుల వివరాలు

మండలం	విభాగం	యూనిట్లు	దరఖాస్తులు
అనపర్తి	బీసీ	33	293
అనపర్తి	కాపు	7	52
అనపర్తి	ఈడబ్ల్యూఎస్	22	163
బిక్కవోలు	బీసీ	62	480
బిక్కవోలు	కాపు	17	111
బిక్కవోలు	ఈడబ్ల్యూఎస్	11	44
పెదపూడి	బీసీ	53	730
పెదపూడి	కాపు	24	40
పెదపూడి	ఈడబ్ల్యూఎస్	12	58
రంగంపేట	బీసీ	33	272
రంగంపేట	కాపు	41	182
రంగంపేట	ఈడబ్ల్యూఎస్	8	36
మొత్తం		376	2,461

ఊరూరా ప్రచారం

ఎన్ని లక్షల రూపాయల రుణానికైనా దరఖాస్తు చేసుకోండి, ఇచ్చేస్తాం అంటూ టీడీపీ కూటమి నాయకులు ఊరూరా ప్రచారం చేసి ఊదర గొట్టారు. కులాల వారీగా ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. దీనిలో భాగంగా బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ తదితర కార్పొరేషన్లు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్లు జారీ చేశాయి. దీంతో వందల మంది నిరుద్యోగులు ప్రభుత్వం రుణాలిస్తుందనే ఆశతో దరఖాస్తు చేసుకున్నారు.

నిలిచిన ప్రక్రియ!

ఒక్కో మండలానికి వందలోపు మాత్రమే యూనిట్లు కేటాయించడం, ఒక్కో పంచాయతీలో ముగ్గురు, నలుగురు మాత్రమే రాయితీ రుణం పొందే అవకాశం ఉండడంతో దరఖాస్తుదారులు కూటమి పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులను ఆశ్రయించి సిఫారసులు చేయించారు. అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తి చేశారు. ఈ జాబితాలను బ్యాంకులకు చేరవేయగా, బ్యాంకు అధికారులు మళ్లీ వీరిలో కొందరిని ఎంపిక చేసి ఆ జాబితాను జిల్లా ఉన్నత అధికారుల అనుమతి కోసం పంపించారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అధికారులు నిలిపివేశారు.

పెరిగిన రాజకీయ జోక్యం

సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం పెరిగింది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల పెత్తనం సాగింది. వారు ఎవరి పేరు చెబితే వారికే సబ్సిడీ రుణాలు ఇచ్చారు. ఇప్పుడు ఆ కమిటీలు లేకపోయినా గ్రామాల్లో కూటమి వ్యవహారాలు చూస్తున్న నాయకులు.. లబ్ధిదారుల జాబితాలను తయారు చేస్తున్నట్లు సమాచారం. వీటిని అధికారుల వద్దకు ఎమ్మెల్యే పంపుతున్నారని తెలుస్తోంది. దీంతో దరఖాస్తుదారుల్లో నిరాశ అలుముకుంది.

నియోజకవర్గంలో 2,461 దరఖాస్తులు

నియోజకవర్గంలో బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్‌లకు 376 యూనిట్లు మంజూరు కాగా 2,461 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో బీసీ యూనిట్లు 181కి 1,775, కాపు యూనిట్లు 89కి 385, ఈడబ్ల్యూఎస్ యూనిట్లు 53కి 301 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

నమ్మించి మోసం చేయడమే..



సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండానే పూర్తిగా అమలు చేసేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు అరచేతిలో స్వర్గం చూపుతున్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. స్వయం ఉపాధి రుణాలు వస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చనే ఆశతో వేల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ రుణాలు మంజూరు చేయకుండా మధ్యలో చేతులెత్తేసి నిరుద్యోగులకు ప్రభుత్వం మొండి చేయి చూపింది. ఇది పక్కాగా నమ్మించి మోసం చేయడమే.

– పోతుల ప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్, ఊలపల్లి

చిత్తశుద్ధి ఉంటే కొనసాగించాలి



ప్రభుత్వానికి ప్రజలంటే అలుసా, స్వయం ఉపాధి రుణాలొస్తాయనే ఆశతో వందల మంది నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకున్నారు. అంతా చేసి రుణాలు ఇవ్వాల్సిన సమయంలో చేతులెత్తే యడం ఏమిటి?. ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణాలు మంజూరు ప్రక్రియను కొనసాగించాలి.

– బొడ్డు ముత్యాలరావు, బీసీ నాయకుడు, పందలపాక

112 మందికి కంటి పరీక్షలు



కంటి ఆపరేషన్ కోసం రోగులను వేమగిరికి తీసుకువెళుతున్న నిర్వాహకులు

పెదపూడి: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పెదపూడిలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా మూడో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. సేవా సమితి ఆవరణలో ప్రతి మంగళవారం హోమియోపతి వైద్య శిబిరం కూడా జరుగుతుందన్నారు. కాగా.. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యులు శిబిరంలో 112 మందికి కంటి పరీక్షలు జరిపారు. వారిలో 15 మందికి ఆపరేషన్లు, మరో 15 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ మార్ని సత్యనారాయణ చౌదరి, సేవాదళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

బిక్కవోలు: మండలంలోని కొన్ని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. బిక్కవోలు సబ్ స్టేషన్ పరిధిలోని బిక్కవోలు, ఊలపల్లి గ్రామాలు, రంగాపురం సబ్ స్టేషన్ పరిధిలోని రంగాపురం, ఇలపల్లి, ఇలపల్లి పాకలు, మర్రిపూడి అగ్రికల్చర్ బోర్లకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

ఉపాధ్యాయులతోనే సమాజ అభ్యున్నతి



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ సభ్యులు

కోరుకొండ: ఉపాధ్యాయులతోనే సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పల్ల రాజారావు అన్నారు. బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు, సంఘ సభ్యులను గురువారం కోరుకొండ సంఘం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజారావు మాట్లాడుతూ 1971లో తెలంగాణలో ఏర్పడిన పీఆర్‌టీయూ ఆంధ్రాలో కూడా విస్తరించబడి, బలమైన ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం అహర్నిశలు పోరాడుతోందన్నారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఆగ్నేష్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ సభ్యులు విద్యాభివృద్ధితో ముందుంటారన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సాంబశివరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి షేక్ రహీమా బేగం, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు, ఎన్.లక్ష్మీనారాయణ, అర్జునరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.రాజు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతుకు ఆర్థిక సాయం



ప్రిన్సిపాల్ హేమకు నగదు అందిస్తున్న ఇజ్రాయేలు, రాంబాబు, నాగేంద్ర

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులకు గ్రామానికి చెందిన కారి దాసు రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కాగా.. కళాశాలలో ఆర్‌ఓ ప్లాంట్ చెడిపోవడంతో విద్యార్థులకు తాగునీటి సదుపాయం కరవైంది. దాని మరమ్మతులకు రూ.30 వేలు అవసరమవడంతో దాతల సహాయం కోసం అధ్యాపకులు అభ్యర్థించారు. ఇటీవల కళాశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌కు విచ్చేసి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబుకు కళాశాల అధ్యాపకులు ఈ విషయం తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన దాత కారి దాసుకు ఇజ్రాయేలు, రాంబాబు ఈ విషయం తెలపడంతో.. ఆయన ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులకు రూ.30 వేలు అందించారు. ఈ నగదును ఇజ్రాయేలు, రాంబాబు ఆధ్వర్యంలో కారి దాసు కుమారుడు నాగేంద్ర గురువారం కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమకు అందించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్

పెదపూడి: రైతులకు అందుబాటులో యూరియా, ఇతర ఎరువులు ఉన్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం పెదపూడిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఎరువులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు స్టాక్ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సరిపడే యూరియా, ఇతర ఎరువులు ఆయా గ్రామాల్లోని గోడౌన్లలో రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట కాకినాడ వ్యవసాయ శాఖ ఏడీఏ వై.దుర్గాలక్ష్మి, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ మంజు, మండల వ్యవసాయాధికారి ఎస్.సత్య ప్రసాద, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, సీఈవో ఎం.దుర్గారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దాం

- అబద్ధానికి పర్యాయపదం చంద్రబాబు
- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



అనపర్తిలో తాతారెడ్డి, శ్రీనివాసరెడ్డిలను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి : వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. జి.మామిడాడ గ్రామ కన్వీనర్, కో కన్వీనర్‌గా నియమితులైన మేడపాటి తాతారెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి గురువారం అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పూలమాలలు వేసి దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. కష్టించి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. అబద్ధం అనే పదానికి నారా చంద్రబాబు నాయుడు పర్యాయ పదమని ఎద్దేవా చేశారు. 2024 మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు ప్రతి గడపకూ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా ప్రకటించి 99 శాతం హామీలు అమలు చేశారన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టి ఏడాది దాటిపోయినా ఇప్పటికి హామీలు అమలు ప్రారంభించలేదని విమర్శించారు. మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయరెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ సాంబత్తులు చంటి, రాష్ట్ర వ్యవసాయ సంయుక్త కార్యదర్శి నాగుమళ్ల వీరభద్రరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కె.వాసు, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ ఎస్.అమ్మిరెడ్డి, అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కర్రి శ్రీవెంకటరెడ్డి, నాయకులు చిన్నం సూర్యప్రకాశరెడ్డి, సుధాకర్‌బాబు, మేడపాటి శ్రీను, లంక రమేష్, నల్లమిల్లి వేణురెడ్డి పాల్గొన్నారు.

ధర్మారెడ్డి సోదరులకు పరామర్శ



బీరువాల ధర్మారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మాతృ వియోగంతో బాధపడుతున్న అయ్యప్ప నేషనల్ లారీ యూనియన్ అధినేత గొలుగూరి ధర్మారెడ్డి (బీరువాల ధర్మారెడ్డి), శ్రీనివాసరెడ్డిలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి తల్లి గజలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ రామన్న తాత, ఆర్‌ఆర్ ఎగ్స్ సత్తి రామారెడ్డి, హీరో హోండా సాయిరామారెడ్డి, గొలుగూరి వీర్రెడ్డి, లారీ యూనియన్ సభ్యులు గంధం సత్తిబాబు, ఉమ్మిడి రాంబాబు, కర్రి రామారెడ్డి, ఎన్‌సీఆర్ మునీశ్వర రెడ్డి, పెదకాపు తదితరులు పరామర్శించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కోరుకొండ: లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నవరం ఏఈ కేవీఎస్ చౌదరిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. కొండ పైన లైట్లు వెలగడపోవడంపై ఇటీవల సాక్షి పత్రికలో నీడిలో నరసన్న పేరుతో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ కొండపై వరకూ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు మరో వారం రోజుల్లో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

అనపర్తి: ప్రధాన మంత్రి టీబీ విముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ సోకిన వారికి బలభద్రపురం గ్రాసిమ్ ఇండస్ట్రీస్ పౌష్టికాహార కిట్లను అందజేసింది. స్థానిక ఏరియా ఆసుపత్రిలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 35 మందికి వీటిని పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తి వీర్రెడ్డి సేవలు చిరస్మరణీయం



రామవరంలో వీర్రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

అనపర్తి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, స్వర్గీయ సత్తి వీర్రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. వీర్రెడ్డి జయంతిని గురువారం ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు, కుమారులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. వీర్రెడ్డి కుమారులైన విశాఖపట్నం గౌతమి సంస్థల అధినేత సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది సత్తి సుబ్బిరెడ్డి తదితరులు రామవరంలోని వీర్రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాయవరం మునసబు గారి శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన వీర్రెడ్డి.. రామవరం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా, సీడీసీ చైర్మన్‌గా సేవలందించడమే కాకుండా వైఎస్సార్ సీపీలో కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో రామవరం గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు

- సాగునీరు ఇవ్వలేక చేతులెత్తేశారు
- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం



స్కూటర్‌పై ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: నియోజకవర్గంలోని పంట కాలువలను శుభ్రం చేసి ఆఖరి ఎకరం వరకు నీరు చేరేలా పనులు చేశామంటూ బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో గోదావరి కాలువకు కూత వేటు దూరంలోని పొలాలకు నీటి చుక్క కరువై ఎండి పోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం పెదపూడి మండలం కైకవోలులో ఎండిపోతున్న పంటను పరిశీలించారు. అక్కడి పరిస్థితిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు స్వయంగా చూపించారు. మాజీ ఎమ్మెల్యే ఆ పొలంలో స్కూటర్‌పై తిరిగి పరిస్థితిని పరిశీలించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే..

డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎంతో చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని, తీరా చూస్తే ఊడ్పుల దశలోనే నీరు అందించలేని పరిస్థితికి తీసుకువచ్చారన్నారు. కైకవోలులో పొలాలు చూస్తే పంట కాలువలు ఏ మేరకు బాగు చేశారో అర్థమవుతుందన్నారు. ఆ గ్రామంలో ఎప్పుడూ పొలాలు బీటలు వారలేదని, కూటమి ప్రభుత్వంలో ఎండిపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తాను ఇక్కడకు వస్తున్నానన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తన కుమారుడు మనోజ్ రెడ్డిని ఆఘమేఘాలపై గ్రామానికి పంపించారన్నారు. తమ పర్యటనతో కూటమి నేతల్లో కదలిక వచ్చిందని, నీటిపారుదలశాఖ అధికారులతో మనోజ్ మాట్లాడినట్లు తెలిసిందన్నారు. ఇది ముమ్మాటికి వైఎస్సార్ సీపీ శ్రేణుల విజయమన్నారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకట రమణ, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాంబత్తుల చంటి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి వెంకటరమణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, ఎంపీటీసీ తిమ్మరాజు రాజాబాబు, ఉప సర్పంచ్ పండు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు శివాజీ రాజు, రామచంద్ర చౌదరి, నీలం సత్తిబాబు, ఎల్లే సాగర్, సాంబత్తుల సురేష్, సావాడ సూరిబాబు, మేడిశెట్టి త్రిమూర్తులు, జి.తాతబ్బాయి, రాయుడు చౌదరి, సావాడ వెంకటరమణ, సావాడ రాంబాబు, కౌలు రైతులు ఉన్నారు.

కొనసాగుతున్న పారాయణ యజ్ఞం



గురు చరిత్రను పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో లోక కల్యాణం, ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ చేపట్టిన 11 గురువారాల గురు చరిత్ర పారాయణ యజ్ఞం రెండో వారానికి చేరుకుంది. స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి రోజు ప్రారంభించిన ఈ కార్యక్రమం విజయదశమి వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. 12 గురువారాల పాటు జరిగే ఈ పారాయణలో ఒక గురువారం సాయి సచ్ఛరిత్రను పారాయణ చేస్తారన్నారు. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఉదయం 6 గంటలకు గురు చరిత్ర పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నం 2.30 గంటలకు పూర్తి చేస్తున్నారు. బాబా దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రాధాన్యతనిస్తూ ఒక్కొక్కరు సమయాన్ని బట్టి ఒకటి నుంచి ఐదు అధ్యాయాలు పఠనం చేస్తున్నారు. దశాబ్దంగా ప్రతి ఏటా ఈ విధంగా 11 గురువారాలు గురు చరిత్రను సాయిబాబా సన్నిధిలో పారాయణ చేస్తున్నారు.